సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి ఉదయం నుంచే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడు..!

'ఇరగవరం మండలానికి చెందిన మహిళ లక్ష్మి భర్త 2024 జనవరిలో అనారోగ్యంతో మృతిచెందారు. సాధారణ ఎన్నికలు దగ్గర పడడంతో కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంకేముంది పింఛన్ వస్తుందని ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది దాటినా ఇప్పటికీ పింఛన్ మంజూరు చేయలేదు. ఇద్దరు ఆడ పిల్లలతో ఆ మహిళ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది.'

'నిడమర్రు మండలానికి చెందిన యువకుడు మహేష్ సదరం సర్టిఫికెట్ పొంది ఏడాదిగా పింఛన్ కోసం వేచి చూస్తున్నాడు. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి వాకబు చేసుకోవడంతోనే సరిపోతోంది.'

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కొత్త పింఛన్ల జారీ శూన్యం

ప్రతి సచివాయం పరిధిలో 50 వరకూ పింఛన్ దరఖాస్తులు

వితంతువులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న ఎంతోమంది పింఛన్ కోసం ఎదురుచూపు

పింఛన్ల మంజూరులో జాప్యంపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వం ఏటా జూన్, జనవరిలో కొత్త పింఛన్ల మంజూరు చేపట్టేది. దీంతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ధీమాగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల మంజూరు లేదు. దీంతో పింఛన్ల కోసం వేల మంది ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాలో 2.32 లక్షలు, ఏలూరు జిల్లాలో 2.68 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్లు అందుకుంటున్న ఎంతోమంది వృద్ధులు ఈ కాలంలో మరణించారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో పింఛన్లు పొందుతున్న వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించిన చాలా మందిని అనర్హులని తేల్చడం సైతం జరిగింది. పింఛన్లు తగ్గించుకునేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కొత్త పింఛన్ల మంజూరు గురించి మాత్రం నోరుమెదపడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగానే చాలా మందికి 60 ఏళ్లు నిండిన వారు, భర్తను కోల్పోయిన వితంతువులు, తీవ్ర అనారోగ్యం పాలైన వారు అనేక మంది పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2024 జనవరిలో వీరంతా కొత్త పింఛన్లు వస్తాయని ఆశించారు. ఎన్నికలు దగ్గర పడడంతో కొత్త పింఛన్ల మంజూరు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిగా పింఛన్ కోసం సచివాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇంకా సైట్ ప్రారంభించలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వం మాత్రం కొత్త పింఛన్ల మంజూరుపై మాట్లాడం లేదు. ప్రతి సచివాలయంలోనూ దాదాపు 50 వరకూ కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అర్హులకు ఎప్పటికి పింఛన్ ఇస్తారో అర్థంకాకుండా పోయింది. ఇంటి పెద్దదిక్కైన భర్తను కోల్పోయిన ఎంతోమంది మహిళలు ఆర్థికంగా తీవ్రంగా నలిగిపోతున్నారు. వితంతు పింఛన్ మంజూరైతే నెలకు రూ.నాలుగు వేలు వస్తే ఆర్థికంగా ఎంతో కొంత చేయూత ఉంటుందని ఆ మహిళలంతా భావిస్తున్నారు. 60 ఏళ్లు నిండిన చాలా మంది వృద్ధాప్య పింఛన్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. పక్షవాతం, కిడ్నీ సమస్యలతో ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తే వైద్య ఖర్చులకు ఉపయోగపడతాయని పింఛన్ కోసం ఆశగా చూస్తున్నారు. కొత్త పింఛన్ల జారీపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి స్పందన లేకుండా పోయింది. పింఛన్ల మంజూరులో జాప్యంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోయిన మహిళలకు స్పౌజ్ పింఛన్లు మాత్రం ఇవ్వడం జరిగింది. కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి, వెంటనే మంజూరు చేయాలని జనం కోరుతున్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వం తీవ్ర కాలయాపన చేస్తుందన్న భావన జనాల్లో ఏర్పడుతోంది. పింఛన్ల మంజూరులో జరుగుతున్న జాప్యం జనాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

రూ.8 కోట్లతో ఏటిగట్టు పటిష్ట పనులు

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

గోదావరి ఏటిగట్టు పరివాహక గ్రామాల ప్రజలకు వరద వస్తే ఎటువంటి భయం లేకుండా భద్రత కల్పించేలా రూ.ఎనిమిది కోట్లతో ఏటిగట్టు పటిష్ట పనులు చేపట్టినట్లు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా మండలం బూరుగుపల్లి, కెఎస్.పాలెం గ్రామాల్లో రూ.కోటీ ఏడు లక్షలతో సిమెంట్ రహదారులకు ప్రారంభోత్సవం, రక్షిత నీటి పథకాలకు మంత్రి కూటమి నేతలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి రామానాయుడుకు గ్రామస్తులు, రైతులు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూల వర్షం కురిపించారు. ఆ గ్రామాల్లో కార్యక్రమాలకు మంత్రి రామానాయుడు మోటార్ సైకిల్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో గోదావరికి వరదలొస్తే ఏటిగట్టుకు గండి పడకుండా గ్రామస్తులే కాపాడుకున్నారని, గత మంత్రులు వచ్చారు చూశారుగాని ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని తెలిపారు. తమ ప్రభుత్వం రూ.ఎనిమిది కోట్లతో పాటు సిమెంట్ రహదారులకు, తాగునీటికి, కాలువల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకురావడం జరిగిందని మంత్రి వివరించారు. గత టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు - దొడ్డిపట్ల ఆర్‌అండ్‌బి రహదారి రూ.20 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి ఖాళీ చిల్లు కొండను అప్పగించాడని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి శెట్టి పెద్దరాజు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణ రాజు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి రామానాయుడు

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సమ్మె

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతి

ప్రజాశక్తి - తణుకు

చాలీచాలని వేతనా లతో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ తణుకు మున్సిపాల్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (జెఎసి) ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించి, అనంతరం ఎంఎల్‌ఎ కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ ఉద్యోగులు ఎంతో కాలంగా పరిష్కారం కానీ సమస్యలపై గతంలో ఎన్నోసార్లు వినతి ప్రతాలు ఇచ్చినప్పటికీ అవి పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించని కారణంతో సమ్మె బాట పట్టాల్సివచ్చిందన్నారు. కార్మికులందరికీ టెక్నికల్ జీతం నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ జీతం నెలకు రూ.24,500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పడాల దానం, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు రాధాకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న జెఎసి

హామీలు అమలు చేయకుండా కాలయాపన

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ - కూటమి ఏడాది పాలనపై సిపిఎం బుక్‌లెట్ విడుదల

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో దారితప్పుతున్న కూటమి ఏడాది పాలన బుక్‌లెట్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడతూ కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి ఏడాది గడిచిందన్నారు. తన ఎన్నికల క్యాంపెయిన్‌లో 143 హామీలు ఇచ్చిందని, అలాగే సూపర్ సిక్స్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఏడాది కూటమి ప్రభుత్వం పనిని సమీక్షించి సిపిఎం బుక్‌లెట్‌ను ముద్రించి విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో 20లోపే అమలు చేశారన్నారు. అత్యధిక హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసిన దానికి రేటింగ్, గ్రేడింగ్ ఇవ్వాల్సి వస్తే ఏడాది కాలంలో చాలా తక్కువ మార్కులే వచ్చాయన్నారు. 10 మార్కులకు గాను గాను 1.75 మార్కులు వచ్చాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పై వారే తమ ఖ్యాతిని ప్రకటించుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు జరిపేశామని చెప్పి వారికి వారే సంతృప్తి చెందారన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, బద్దలగొట్టండి అని ప్రజానీకానికి చెప్పి ప్రస్తుతం చేస్తున్నదేంటని ప్రశ్నించారు. పనిచేస్తున్న మీటర్లను తొలగించి వాటిస్థానే స్మార్ట్ మీటర్లను బిగించేదానికి సిద్ధమైందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మార్పు చేసి ప్రజలను ఇబ్బందుల పాలుచేసిందన్నారు. వాహనాల డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బుక్లెట్ విడుదల చేస్తున్నా సిపిఎం నేతలు

ఎమర్జెన్సీ నాడు - నేడు సెమినార్

నేడు ప్యాడి అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో నిర్వహణ

హాజరుకానున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్

భీమవరం :భీమవరంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో ఎమర్జెన్సీ నాడు - నేడు అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ నెల 25వ తేదీకి ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతోందన్నారు. 1975 నాటికి దేశంలో కరువు, ఆయిల్ సంక్షోభం, ధరలు, నిరుద్యోగం పెరిగిపోయాయన్నారు. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందన్నారు. ఈ సమయంలోనే ఇందిరాగాంధీ లోక్‌సభ ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పునిచ్చిందన్నారు. దీంతో 352 అధికరణాన్ని దుర్వినియోగం చేసి ఇందిరా గాంధీ జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించారన్నారు. ప్రభుత్వంపై ఎవరూ నిరసనలు తెలపకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం. మీడియాపై నిఘా పెట్టి సెన్సార్ విధించడం కూడా ఎమర్జెన్సీలో భాగమే అన్నారు. సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలపై, పత్రికల పై, ప్రజల పైన తీవ్ర నిర్బంధం ప్రయోగించారని గుర్తు చేశారు. నేడు దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించలేదని అయినప్పటికీ 50 ఏళ్ల నాటి కంటే తీవ్రంగా మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందన్నారు. దేశ సంపద కార్పొరేట్ల పరమవుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా ప్రయివేటీకరణ పెరిగిపోయిందని పేర్కొన్నారు. కులాల మధ్య, ప్రాంతాల మధ్య పరస్పర ఘర్షణలు పెరిగిపోయాయన్నారు. ఈ అంశాలన్నింటినీ వివరించేందుకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవిఈ సెమినార్‌లో పాల్గొంటారన్నారు. మేధావులు, విద్యార్థులు సెమినార్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎన్‌లో మాణిక్యరావు శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనమండలి సభ్యులు, అనుబంధ కళాశాలల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులైన ఎంజె.మాణిక్యరావు వందవ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల శాసనమండలి సభ్యులు బి.గోపీమూర్తి విచ్చేసి మాట్లాడారు. ఎయిడెడ్ అధ్యాపకులకు ఎంజె.మాణిక్యరావు దేవుడులాంటి వారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన స్మృతిగా శత జయంతి ఉత్సవాలను ఇక్కడ జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు కళాశాలలు వైఎన్ కళాశాల, బిజిబిఎస్ మహిళా కళాశాల, ఎస్‌వికెపి, డాక్టర్ కెఎస్.రాజు, పెనుగొండ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జరపడం, కళాశాలల మధ్య ఆహ్లాదకరమైన అనుబంధాన్ని తెలియజేస్తుందన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి జయంతి ఉత్సవాలలో తాను పాల్గోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. అనుబంధ కళాశాలల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కొండ్రు మోహనరావు మాట్లాడుతూ జిఒ నంబర్ 42 తెచ్చిన ఇబ్బందులను వివరించి, మాణిక్యరావు శత జయంతి వేడుకలను ఈ సంవత్సరం అంతా నిర్వహిస్తూ వంద మంది అధ్యాపకులకు అవార్డులను ఇవ్వాలని ఆక్ట ఎపి నిర్ణయించిందన్నారు. జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మాణిక్య రావు శత జయంతి వేడుకలు మన హయాంలో, మనం నిర్వహించడం ఆయన మనకు చేసిన సేవలకు చిరు సత్కారంగా భావిస్తున్నానని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడుగా వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకరావు, బిజిబిఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నీరజ, పెనుగొండ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు, మాజీ ఆక్ట జనరల్ సెక్రటరీ ఎస్‌ఎం.మహేశ్వరి, ఇతర ప్రాంతాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌సి గోపీమూర్తిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్స్

క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు..!

ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)లో దారుణ పరిస్థితులు

కేంద్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన క్రీడాకారిణులు

కేంద్ర బృందం రహస్య విచారణ

టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఏలూరు స్పోర్ట్స్:క్రీడల్లో రాణించాలని ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన క్రీడాకారిణులైన బాలికలపై ఏలూరు జిల్లా కేంద్రం స్పోర్ట్స్ అథారిటీ (శాయ్)లో ప్రధాన కోచ్‌తోపాటు, సహచర కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలడం సంచలనం రేపుతోంది. దర్యాప్తు చేసిన కేంద్ర బృందం శనివారం రాత్రి ఏలూరు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు పాల్పడిన కోచ్‌లపై ఫిర్యాదు చేయడం చూస్తే పరిస్థితి తీవ్రత ఏంటో అర్థమవుతుంది. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కనే ఏర్పాటు చేసిన శాయ్ కేంద్రంలో క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు హెచ్చుమీరడంతో వారంతా కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. పది మంది మహిళా క్రీడాకారిణులు శాయ్ నిర్వాహకులు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఏలూరు శాయ్ ఇన్‌ఛార్జితో పాటు వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ కోచ్ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏలూరులోని శాయ్‌ల అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలు తర్ఫీదు పొందుతున్నారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బాలికలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. బాలికలకు శాయ్ హాస్టల్లోనే వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిసింది. బాలురకు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని గదుల్లో వసతి కల్పిస్తున్నారు. బాలికలపై ప్రధాన కోచ్ వినాయక్‌తో పాటు, సహచర కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు క్రీడాకారిణులు శాయ్ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు జిల్లా శాయ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేంద్రం కార్యాలయం బెంగుళూరు శాయ్‌లోని ఇద్దరు సభ్యుల బృందాన్ని విచారణకు ఆదేశించింది. విచారణ బృందం ఏలూరు శాయ్‌లో గత కొద్ది రోజులుగా రహస్య విచారణ చేపట్టి క్రీడాకారిణులైన బాలికలు చేసిన ఫిర్యాదులు వాస్తవమేని నిర్ధారించినట్లు తెలుస్తోంది. బెంగుళూరు నుంచి వచ్చిన శాయ్ విచారణ అధికారులు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్లో దీనిపై ఫిర్యాదు చేశారు. ఏలూరులో శిక్షణ పొందుతున్న క్రీడాకారుణుల నుండి పూర్తిస్థాయి వివరాలను అధికారులు సేకరించారు. కొందరు బాలికలు ఉండడంతో విచారణ వివరాలు కేంద్ర కార్యాలయానికి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన కోచ్ వినాయక కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన కోచ్ వినాయక్ కొందరు బాలికలను తన ఆఫీసు గదికి పిలిచి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వారిపై వేయకూడని చోట చేతులు వేసి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఏలూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఏలూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడాకారిణుల లైంగిక వేధింపులపై మీడియాలో రావడంతో ఈ ఘటనపై విచారణ ఊపందుకుంది. బాలికల సంరక్షణ అధికారులు, పోలీసులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం సంయుక్తంగా ఆదివారం రెండో రోజు కూడా విచారణ సాగించింది.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - పెంటపాడు

దేశంలో ప్రాముఖ్యత కలిగిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ బిజెపి పాలకవర్గం పరిపాలన సాగిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు అన్నారు. ఆదివారం ప్రజాసంఘాల కార్యాలయం వద్ద దూలం ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ సిపిఎం 24వ జాతీయ మహాసభల తీర్మానాలను సభ్యులకు వివరిస్తూ అనేక విషయాలు ప్రస్తావించారు. ఈ దేశంలో వామపక్ష పార్టీగా సిపిఎం అనేక రంగాల్లో విస్తరించిందని తెలిపారు. ఈ దేశంలో ఉన్న పాలక పార్టీ బలుగు బలహీన వర్గాల మీద చేస్తున్న దాడులను వారు వివరించారు. భారతదేశం లౌకిక దేశమని అటువంటి విధానాలకు తూట్లు పొడుస్తూ బిజెపి పరిపాలన సాగిస్తుందని తెలిపారు. ఒకపక్క ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం, మరోపక్క ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వీటి నష్టం గురించి సభ్యులకు వివరిస్తూ యుద్ధం ఇలాగే కొనసాగితే ఈ దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతాయని, వాతావరణం కాలుష్యం అయ్యే పరిస్థితి ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో మన దేశ ప్రధాని వీటి మీద దృష్టి పెట్టకుండా యోగా పేరుతో ప్రజలను పక్కదారి పట్టించే విధానాలు అవలంబిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరపరుపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, మరపట్ల దానయ్య, ఎండ పెద్దిరాజు, పెనగంటి దుర్గా, మీసాల శ్రీను, వడ్డాది సన్నాసిరావు, గోపి అనురాధ, శ్యామల, సీత, జయంతి, స్వరలత, సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

సాహిత్యంలో స్త్రీల పాత్ర చాలా గొప్పది

ఘనంగా పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక రసధుని పురస్కారం

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ దేవి

ప్రజాశక్తి - పాలకొల్లు

సాహిత్యంలో స్త్రీల పాత్ర చాలా గొప్పదని, వీరలక్ష్మీ దేవి తాను చూసిన సమాజాన్ని, అసమానతలను, ప్రేమానురాగాలను తన రచనలలో ఎంతో వైవిధ్యంగా చెప్పారని డాక్టర్ గుత్తికొండ కొండలరావు చెప్పారు. పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ యేటేటా ఇచ్చే పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక పురస్కారం ప్రధానం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభ ఆదివారం లయన్స్ క్లబ్లో జరిగింది. సభకు నూతన అధ్యక్షులు కొట్టి భాస్కరావు అధ్యక్షత వహించారు. నూతన ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం స్వాగతం పలికారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన వసుధారాణి వీరలక్ష్మి దేవి రచనలు, కథా సంకలనాలు మానవ జీవితంలోని ప్రేమని, స్వేచ్ఛా కాంక్షని, మృగ్యమైపోతున్న విలువల్నీ బలంగా పట్టి చూపిస్తాయని వివరించారు. మరొక విశిష్ట అతిథి డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు వీరలక్ష్మీ దేవి సాహిత్య విమర్శ గ్రంథాలను గురించి వివరిస్తూ ఆమె మంచి రచయిత్రి మాత్రమే కాదని మంచి స్నేహితురాలు, నాయకురాలు, అన్వేషి అని, ఆమె రచనలలో ఆంతరంగిక స్వేచ్ఛ కోసం పెనుగులాట కనిపిస్తుందని అన్నారు. పురస్కార గ్రహీత డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మిదేవి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు ఎన్నో పురస్కారాలు అందుకున్నా ఈ 2025 రసధుని సాహితీ పురస్కారం తనకెంతో ప్రత్యేకమైనదని, అందుకు రసధుని సాహితీ సంస్థకు ధన్యవాదములు తెలిపారు. తదనంతరం పెద్దిబొట్ల బ్రహ్మయ్య రసధుని స్మారక పురస్కార గ్రహీతను పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ సోదరులు నగదు పురస్కారంతో పాటు ఘనంగా సన్మానించారు. అనంతరం చేగొండి వి.వి.సత్యనారాయణ మూర్తి నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. వంగా నరసింహరావు, మాడభూషి కృష్ణ ప్రసాద్‌లు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, చేగొండి రంగారావు, జె.జయ దుర్గారావు, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, బిఎస్ఎన్ఎల్.రాజు, ర్యాలీ విష్ణుమూర్తి, మామిడిశెట్టి శ్రీనివాస్, కోలాటి పెద్దిరాజు, దంగేటి గోపాలకృష్ణ, యర్రంశెట్టి రతన్‌జీ, చిప్పాడ వామనమూర్తి, జవ్వాజి కళ్యాణ్, జి.లక్ష్మీనారాయణ, వై. ప్రభాకర శాస్త్రి పాల్గొన్నారు.

వేటగాళ్ల హల్‌చల్..!

విచ్చలవిడిగా ఆక్వా చెరువుల వద్ద నాటు తుపాకుల వినియోగం
భయభ్రాంతుల్లో ప్రజలు
పట్టించుకోని అధికారులు

రొయ్యల చెరువు వద్ద నాటు తుపాకులతో పహార కాస్తున్న వేటగాడు

ప్రజాశక్తి - కాళ్ల
రొయ్యలు, చేపల చెరువుల వద్ద నాటు తుపాకీల మోత వినిపిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆక్వా సాగు విస్తీర్ణం 2.90 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతాల్లో నాటు తుపాకులతో వేటగాళ్లు హల్‌చల్ చేస్తున్నారు. ప్రతిరోజు ఆక్వా చెరువులపై పిట్టలు కొట్టేందుకు తుపాకులను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, భీమవరం రూరల్ మండలాలు, ఏలూరు జిల్లాలోని గణపవరం, నిడమర్రు మండలాల్లోను ఇదే విధంగా నాటు తుపాకులు దర్శనమిస్తున్నాయి.

తుపాకీలకు ముందుగుండు లోడింగ్ చేస్తున్న వేటగాడు

భయాందోళనలో ప్రజలు..
జిల్లాల్లో పలు గ్రామాల్లో నాటు తుపాకీల మోతతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపలు, రొయ్యల చెరువులు ఇళ్లకు సమీపంలో ఉన్నాయి. పలు మండలాల్లోని అనేక గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువుల గట్లపై నాటు తపాకీలతో ప్రహారా కాస్తూ పక్షులను చంపుతున్నారు. ఈ తుపాకీలు కాల్చే శబ్దానికి ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. దర్జాగా చెరువుగట్ల వద్ద నాటు తుపాకీలతో పక్షులను హతమారుస్తున్నారు. పట్టపగలే వాహనాలపై తుపాకులను చేతపట్టుకుని తిరుగుతున్నా అటు పోలీసులు, ఇతర అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తుపాకీ గురి తప్పితే తమ పరిస్థితి ఏంటని ఆయా మండలాల్లోని ప్రజలు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు.

ఇది నేరం కాదా..!
నాటు తుపాకీలతో కేవలం పిట్టలనే కాలుస్తున్నారా? లేక మరేదైనా జరుగుతుందా? తుపాకుల సరఫరా ఎక్కడ నుంచి జరుగుతుంది అంటూ పలువురు వీటిపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా ఈ నాటు తుపాకులతో ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వేటగాళ్లు ఇంత బహిరంగంగా ఎలా వస్తున్నారు? వారికి రూ.35 వేలు నుంచి రూ.40 వేలు జీతాలు ఎలా ఇస్తున్నారు? ఇదేమీ నేరం కాదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

గతంలో నాటుతుపాకీతో జరిగిన దారుణాలు గుర్తు తెచ్చుకుని ప్రజలు భయపడుతున్నారు. గతంలో సరిగ్గా పంచాయతీ ఎన్నికల సమయంలో ఉండి మండలంలోని ఎన్ఆర్‌సి అగ్రహారంలో నాటుతుపాకీతో ఓ హత్య జరగడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అప్పుడు ఆక్వా చెరువులపై పిట్టలు కొట్టేందుకు తెచ్చిన నాటుతుపాకీగా పోలీసులు గుర్తించినట్లు పలువురు చెబుతున్నారు. చెరుకువాడ గ్రామంలో నాటు తుపాకీతో ఓ వ్యక్తి కోతిని కాల్చడం కూడా సంచలనానికి దారి తీసింది. ఇంతటి భయంకరమైన ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టంచుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వెంటనే వీటిపై చర్యలు తీసుకుని ప్రజల ప్రశాంత జీవనానికి అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

నేడు కొయ్యేటిపాడులో 'పల్లె పల్లెకూ మన పితాని'
ప్రజాశక్తి - పెనుమంట్ర
మండలంలోని కొయ్యేటిపాడులో ఈనెల 23వ తేదీ సోమవారం పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమం జరుగుతుందని టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వి.బలే రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పాల్గొని ప్రజలతో, మండల స్థాయి అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈమేరకు సోమవారం ఉదయం 9 గంటలకు కొయ్యేటిపాడులో పల్లె పల్లెకు మన పితాని, 11 గంటలకు కూటమి ప్రతినిధులతో ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొంటారని అన్నారు.

రాజమండ్రి వెళ్లే బస్సులు దారి మళ్లింపు
ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
నిడదవోలు రైల్వేగేటు మరమ్మతుల కారణంగా నిడదవోలు ఎండిఒ, తహశీల్దార్ ఆదేశానుసారం మూడురోజుల పాటు గేటు మూసివేసి ఉంచుతుందని తాడేపల్లిగూడెం డిపో ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) ఆర్‌ఎల్.సుధారాణి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్లే ఆర్‌టిసి బస్సులను సోమవారం నుంచి తాడేపల్లిగూడెం, ప్రత్తిపాడు జంక్షన్, నవాబుపాలెం, నందమూరు, శెట్టిపేట, నిడదవోలుకు బదులుగా తాడేపల్లిగూడెం, ప్రత్తిపాడు క్రాస్‌రోడ్, నవాబ్ పాలెం, మాధవరం, అప్పారావుపేట, కోరుమామిడి, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం మీదుగా నిడదవోలు చేరుతాయన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోగలరని ఆమె ఈ ప్రకటనలో తెలియజేశారు.

నేడు యథావిధిగా 'పిజిఆర్‌ఎస్'
ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
ప్రతి సోమవారం నిర్వహించబడుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో 23వ తేదీ సోమవారం యథావిధిగా ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించబడుతుందని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రజలు తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ మొదలగు సమస్యలు ఉన్న యెడల ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చి ఫిర్యాదులు సమర్పించాలిందిగా కమిషనర్ తెలియజేశారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట
ప్రజాశక్తి - మొగల్తూరు
మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోక అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి ఆంజనేయులురావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అవినీతి అనకొండ 'కొట్టు' : జనసేన
ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంత అవినీతి చేసిన ఎంఎల్‌ఎగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ చరిత్రలో ఎక్కుతారని జనసేన నాయకులు ధ్వజమెత్తారు. జనసేన పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనసేన నాయకుడు పైబోయిన రఘు మాట్లాడుతూ కొట్టు సత్యనారాయణ రాజకీయం మొదలుపెట్టినప్పటి నుంచి తనను తెలుసని, వ్యవస్థలో ఎక్కడైనా చట్టపరంగా కొన్ని సమస్యలు ఉంటే వాటిని రాజకీయాలకు ఆపాదించడం తగదని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వత్సవల్లి కాశీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌పై, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మపై కొట్టు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, చావల రమేష్, మైలవరపు రాజేంద్రప్రసాద్, నీలిపాల దినేష్ పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసిపి పాలన అరాచకం : ఎంఎల్‌ఎ
ప్రజాశక్తి - తణుకు
గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల అరాచక పాలన సృష్టించిన జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి గద్దె దించారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎగా తాను ప్రమాణ స్వీకారం చేసి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు కూటమి నాయకులు, కార్యకర్తలకు రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. అరాచకమైన పరిపాలన నుంచి ప్రజాస్వామ్యంగా పరిపాలనకు రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారన్నారు. తణుకు నియోజకవర్గ ప్రజలు గతంలో ఎప్పుడూ రాని విధంగా, భవిష్యత్తులో సైతం రాని విధంగా మెజార్టీ ఇచ్చారని తెలిపారు. ఏడాది కాలంలో సుమారు రూ.1400 కోట్ల అభివృద్ధి, సంక్షేమం అందించినట్లు తెలియజేశారు. రాబోయే నాలుగేళ్లలో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో సమస్యలపై పనిచేయాలి
ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సమితి ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి
ప్రజాశక్తి - భీమవరం
నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పనిచేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సమితి ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో 86వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లంక కృష్ణమూర్తి ప్రసంగించారు. 1938లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, 1939లో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారన్నారు. బెంగళూరు, కేరళ, మద్రాసు, పశ్చిమ బెంగాల్, బీహార్, ఇంకా అనేక రాష్ట్రాల్లో దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతం చేశారన్నారు. ఇదే సందర్భంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నేతాజీ నాయకత్వంలో అనేక పోరాటాలు చేశారన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుండి ఎంఎల్‌ఎలు, పార్లమెంటుకు ఎంపీలు ఎన్నికయ్యేవారు. అంతటిమహోన్నతుడు సుభాష్ చంద్రబోస్ 1942లో అండమాన్ నికోబార్ దీవులలో భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి జెండా ఎగురవేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుగ్గిరాల శ్రీనివాస్, మోటమర్రి శీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ బదిలీల పట్ల హర్షం
ప్రజాశక్తి - పెనుమంట్ర
వైద్య ఆరోగ్యశాఖలో ప్రస్తుతం జరిగిన ఉద్యోగుల బదిలీల పట్ల ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద శాఖగా వివిధ కేటగిరీల ఉద్యోగులను ఎక్కువగా కలిగిన వైద్య ఆరోగ్యశాఖలో పూర్తి పారదర్శకంగా జరిగిన బదిలీల పట్ల పూర్తి సంతృప్తిని కలిగించాయని ఆయన అన్నారు. ఇందుకు సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల పాక దగ్ధం
గేదె పరిస్థితి విషమం - ఆదుకోండి : పశువుల యజమాని
ప్రజాశక్తి - పోడూరు
మండలంలోని గుమ్మలూరు దిరిపేటకు చెందిన చికిలే మాషేను రాజుకు చెందిన పశువుల పాక ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో పశువుల పాకలో రెండు గేదెలు ఉండగా వాటిలో సూడిగేదెకు శరీరభాగం 70 శాతం కాలిపోయింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజువారీ విధంగానే శనివారం రాత్రి దోమలకు పొగ పెట్టేందుకు ఎండి గడ్డితో మంటవేసి పొగ పెట్టారు. శనివారం రాత్రి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వల్ల మంటలు వ్యాపించి పాకకు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఈక్రమంలో సూడి గేదె శరీరం 70 శాతం కాలి గాయాలపాలైంది. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన స్పందించి అప్పటికే పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. పాకలో ఉన్న రెండవ గేదె తాడును స్థానిక యువకులు కోసివేయడంతో ప్రమాదం తప్పింది. రెవెన్యూ సిబ్బంది సమాచారం ఇవ్వగా వీఆర్‌ఓ సలీం మరియా స్థలానికి వచ్చి పరిశీలించారు. వైద్య సిబ్బంది శ్రీవాస్ వైద్యం అందించారు. రెండురోజులు గడిస్తేనే గాని చెప్పలేమని వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో పాడిపైన బతికేటువంటి దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. గేదె విలువ సుమారు రూ.లక్షా 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. తక్షణమే ఆదుకోవాలని పశువుల యజమాని చికిలే మాసేనూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పరీక్షిస్తున్న వైద్యులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత షుగర్ టెస్టులు
ప్రజాశక్తి - నరసాపురం
నరసాపురం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉచితంగా డయాబెటిస్ టెస్టులు 300 మందికి చేశారు. అనంతరం చెప్పులు కుట్టే వారికి కావాల్సిన పనిముట్ల కిట్‌లను అందజేశారు. అనంతరం అప్పన ప్లాజాలో మీటింగ్ నిర్వహించి ఒక రైతును ఘనంగా సత్కరించారు. కోవెల గుడిలో 1000 లీటర్ల వాటర్ ట్యాంక్‌లను క్లబ్ తరుపున బహూకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ జయంతి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ కనగళ్ల రామకృష్ణ, క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్, సెక్రటరీ కంచర్ల బాబ్జి, ట్రెజరర్ కోట్ల బాలకృష్ణ, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంతెన రామరాజు, భూపేష్ రెడ్డిలను సత్కరిస్తున్న సభ్యులు

ఆలయానికి దాతల విరాళం
ప్రజాశక్తి - కాళ్ల
సీసలి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించినటువంటి పోలేరమ్మ అమ్మవారిని ఎపిఐఐసి అధ్యక్షులు మంతెన రామరాజు, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. కీర్తిశేషులు కట్రెడ్డి నాగన్న-వీర్లంకమ్మ, వెంకట సత్యనారాయణ, గోవిందరావు, పార్వతం లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారులు సూర్యనారాయణ, సీతారామ, కట్రెడ్డి చంద్రరావు-ఉమామహేశ్వరి, డాక్టర్ కట్రెడ్డి సత్యనారాయణ-దేవ నాగ పద్మావతి కలిపి రూ.1,00116 విరాళం అందించారు. వారి కుమార్తెలు డాక్టర్ శానం విజయ మోహన్ రావు-మాధవి దంపతులు రూ.25 వేల 11, తోట కామేశ్వరరావు-వీరకుమారి రూ.25 వేల 11, చుండూరు వెంకట సత్యనారాయణ, వెంకట్ లక్ష్మీ కమలావతి రూ.25 వేల 11, కుక్కల నరేంద్ర ప్రసాద్-రాణి దంపతులు రూ.25 వేల 11 మొత్తం రూ.2 లక్షల 160 మంతెన రామరాజు చేతుల మీదగా కమిటీ సభ్యులకు అందించారు. పులకండం మాధవ రమేష్(మల్లవరం) రూ.5,116, గోపు ఉదయ శ్రీనివాస్(పేరుపాలెం) రూ.5116 అందించారు. ఈ సందర్భంగా ఎపిఐఐసి అధ్యక్షులు మంతెన రామరాజు, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. దాతలకు ఆలయ కమిటీ తరపున అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ఆక్వా రైతుల గ్రామసభలు
ఎఫ్‌డిఒ శివరామకృష్ణ
గణపవరం : ఈనెల 24 నుంచి 27 వరకు ఆక్వా రైతులకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గణపవరం మత్స్యశాఖాధికారి ఎన్.శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. 24న గణపవరం, పిప్పర, కేశవరం, సరిపల్లి, ముప్పర్తిపాడు, జల్లికాకినాడ, కొత్తపల్లి, 25న సిహెచ్ అగ్రహారం, ఎస్.కోండేపాడు, కాశిపాడు, అప్పన్నపేట, జల్లి కొమ్మర, 26న మొయ్యేరు, వెలగపల్లి డికె వల్లి, కోమర్రు, వల్లూరు, 27న జగన్నాథపురం, చినరామచంద్రపురం, అర్ధవరం, వాకపల్లి, ముగ్గళ్ల, ఎ.గోపవరం గ్రామాల్లో జరుగుతాయని చెప్పారు. సభలను ఆక్వా రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

రేపు చిన్నపిల్లలకు ఉచిత మెడికల్ క్యాంప్
భీమవరం టౌన్ : భీమవరం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి వసుధ ఫౌండేషన్ సహకారంతో చిన్నపిల్లలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ క్యాంపులో చిన్నపిల్లలను 2డి ఎకో ద్వారా పరీక్షించి గుండె సమస్యలున్న పిల్లలను గుర్తించి తదుపరి అవసరమగు వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. పిల్లలు బరువు పెరగకపోయినా, ఆకలి లేకపోవడం, గుండె సమస్యలు ఉన్నట్లు అనుమానం కలిగితే ఈ క్యాంపులో చూపించి పరీక్షించుకోవల్సిందిగా కోరారు. ప్రతినెల 4వ మంగళవారం ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రమైన తాగునీరు అందించండి
వీరవాసరం : వీరవాసరం గ్రామంలో ప్రజలకు తాగేందుకు పనికివచ్చే పరిశుభ్రమైన తాగునీరు అందించాలని బిజెపి మండల అధ్యక్షుడు వేండ్ర దివాకర్ అధికారులు కోరాడు. ఆదివారం గ్రామంలో పంచాయతీ వారు సరఫరా చేస్తున్నా తాగునీరును ఆయన పరిశీలించారు. అనేక ప్రాంతాల్లో రక్షిత నీటి పథకం పైపులు ద్వారా మురుగునీరు సరఫరా అవుతుందని ఆయన గుర్తించారు. ఈ విషయం సర్పంచి చిక్కిలే మంగతాయారు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కనకారావు దృష్టికి తీసుకెళ్లారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఒక్కరికి పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఆయన వారిని కోరారు.

వైద్య రంగంలో ఉపాధి కల్పన అభినందనీయం
ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్
ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
వైద్యరంగంలో ఎంతోమంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీలో ఆదివారం జరిగిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాదిమంది విద్యార్థులకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించిన జ్యోతి సంస్థ నిర్వాహకులు దత్తు వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు. ఎంబిబిఎస్, ఎంఎస్ వంటి ఖరీదైన చదువులు ధనికులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, పేదలకు చెందిన విద్యార్థులకు నర్సింగ్ రంగంలో అవకాశం కల్పించారని అన్నారు. గత మూడు దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన నర్సింగ్ విద్యను అందించటం అభినందనీయమన్నారు. రాజకీయమంటే ప్రజలకు సేవ చేయడమే, కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా ఎవరికి ఏ అవసరం వచ్చినా సేవా దృక్పథంతో పనిచేస్తున్నామని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాసేవకే వినియోగించాలనే లక్ష్యంతో తాము పని చేస్తున్నామని ఎంఎల్‌ఎ తెలియజేశారు.


నివాళి అర్పిస్తున్న ఎంఎల్‌ఎ, సొసైటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికి వాట్సాప్ వేదిక
ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ
ప్రజాశక్తి - తణుకు
రాబోయే నాలుగేళ్లలో తణుకు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి, సంక్షేమం అమలుచేసే దిశగా పునరంకితం అవుతానని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి వాట్సప్ వేదిక ద్వారా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. తాను ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వాట్సాప్ నంబరుని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. 949322222 నంబరుకు హాయ్ అని పెడితే గ్రామం, వార్డు ఎంపిక చేసుకుని తద్వారా సమస్యను తన దృష్టికి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు.



సేవాగుణం కలవారు ఆర్యవైశ్యులు
వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు
ప్రజాశక్తి - మొగల్తూరు
సేవాగుణం కలవారు ఆర్యవైశ్యులు అని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. దత్తసాయి మందిరంలో ఆదివారం సాయంత్రం వాసవి వనిత క్లబ్ డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరు శాఖ అధ్యక్షురాలు సీమకుర్తి అరుణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వనిత క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని అన్నారు. తోటి వారికి సహాయ సహకారాలు అందించడంలో ఆర్యవైశ్యులు ముందు ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికుడు వాటాల ఏడుకొండలను ఘనంగా సత్కరించారు. పలువురు పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. మొగల్తూరులోని శ్రీదత్తసాయి మందిరానికి నీళ్ల ట్యాంకును, వికలాంగులకు సామాగ్రిని అందజేశారు. పలువురికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రీజనల్ ఆర్గనైజర్ కనగళ్ల విజయరామకృష్ణ, రీజనల్ ఛైర్మన్ వంకాయల శ్యామల, జోన్ ఛైర్మన్ అప్పన బద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వంకాయల రవికుమార్, వనిత క్లబ్ కోశాధికారి అనంతపల్లి మంగామణి, సభ్యులు కారుమూరి రత్నకుమారి, అప్పన విజయ, అనంతపల్లి అరుణ, శాంతాదేవి, వెంకటరమణ, గ్రంధి అంజలి, వేద సీతాకుమారి, ఉద్దగిరి మహాలక్ష్మి, అద్దేపల్లి సుబ్బలక్ష్మి ఉన్నారు.


విశ్రాంత సైనికుడిని సత్కరిస్తున్న సభ్యులు

వైసిపి ప్రభుత్వంలో మంజూరైన పనులకు శంకుస్థాపన హాస్యాస్పదం
ఎంసి మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్
తాడేపల్లిగూడెం: వైసిపి ప్రభుత్వంలో మంజూరైన పనులకు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ భూమిపూజ చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎంసి మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ విమర్శించారు. మండలంలోని కొమ్ముగూడెంలో వైసిపి మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు అధ్యక్షతన ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, కానీ ఆ పనులు మీకు కనపడటం లేదా అన్నారు. వైస్ ఎంపిపి సూర్పన రామకృష్ణ మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పనులు ప్రజలందరికీ తెలుసని, అభివృద్ధే లేదనడం ఆ నాయకుల అవివేకం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కామన రంగబాబు, నాయకులు శ్రీనివాస్, తమ్మిశెట్టి రఘు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

32 మందికి సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ
ఆచంట: ఆచంట నియోజకవర్గంలో దారిద్ర రేఖకు దిగువనున్న పేద వర్గాలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 32 మంది బాధితులకు ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ రూ.13 లక్షల 50 వేల, 864లు నగదు విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో భారీ వర్షం
పెనుమంట్ర : మండలంలోని మార్టేరులోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి ఒక మోస్తారు నుంచి ప్రారంభమై భారీ వర్షం కురిసింది. దీంతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా విద్యుత్ నిలుపుదల చేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడినా గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులకు కాస్తంత ఉపశమనం పొందారు. శనివారం తెల్లవారుజామున కొద్దిపాటి వర్షం కురిసినప్పటికీ మళ్లీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ ఉక్కిరిబిక్కిరి చేసింది. అయితే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాసింది. ప్రస్తుతం ఉన్న విభిన్న వాతావరణాలతో ప్రజలు అనారోగ్యంపాలై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వెండి మకర తోరణం బహూకరణ
వీరవాసరం : రాయకుదురు శివారు వీరవల్లిపాలెం గ్రామంలో రామాలయానికి గ్రామానికి చెందిన గూడూరి సుబ్బారావు కుమారుడు గూడూరి సుధాకర్, లక్ష్మి దంపతులు మకర తోరణాన్ని అందజేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుంది.

డిఎస్‌సి పరీక్షకు 86 మంది గైర్హాజరు
భీమవరం : జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్ష మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం జరిగింది. ఉదయం సెషన్‌లో 310 మందికి గాను 296 మంది హాజరైయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 310 మందికి గాను 238 మంది హాజరైయ్యారు. 72 మంది గైర్హాజయ్యారు. మొత్తం 620 మందికి 534 మంది హాజరైయ్యారు. 86 మంది గైర్హాజరయ్యారు. 86.13 శాతం హాజరు నమోదైంది. స్పెషల్ స్క్వాడ్ టీమ్ పరీక్షా కేంద్రాన్ని విజిట్ చేయడం జరిగింది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ తెలిపారు.

'దంతాల పట్ల శ్రద్ధ అవసరం'
ఉండి : దంతాల పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని విష్ణు డెంటల్ కళాశాల డాక్టర్ చైతన్య అన్నారు. ఆదివారం ఉండి భవానీ పేట, జంగాల కాలనీ తదితర ప్రాంతాలలో విష్ణు డెంటల్ కళాశాల విద్యార్థులు ఇంటింటికి వెళ్లి దంత క్షయం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ విష్ణు డెంటల్ కళాశాల విద్యార్థి బృందం గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు ప్రధానంగా దంత సమస్యలకు సంబంధించిన సేవలు అందించేందుకు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో వారి దంత సమస్యలను గుర్తించి వారికి తగు మందులను ఇవ్వడం జరిగిందని అన్నారు. పిప్పి పళ్ల వల్ల తీవ్ర బాధలు, నిద్రలేమి వంటి సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. దీనికి సంబంధించి పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు వాడటం వల్ల కిడ్నీ సమస్యలు ప్రారంభమవుతాయని తెలిపారు. బాగా పళ్ల పాడైపోయి పిప్పి పళ్ల అధికమైన వారు రూట్ కెనాల్ చికిత్స అవసరమైన వారిని తమ కళాశాలను సంప్రదించాల్సిందిగా తెలిపారన్నారు. త్వరలో ఉండి, భీమవరం నియోజకవర్గంలోని ప్రజలందరికీ తమ కళాశాల తరపున ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం
భీమవరం టౌన్: అమ్మవారి గ్రామోత్సవాలు, జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం 36వ వార్డులోని రామరాజు తోటలో మావుళ్లమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి(చిన మావుళ్లమ్మ) 40వ జాతర మహోత్సవాన్ని ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. గత 40 ఏళ్లుగా సేవ సమితి సభ్యులు సంప్రదాయబద్ధంగా మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ 5 రోజులపాటు జాతర మహోత్సవాలు జరుగుతాయని, 27న అన్న సమారాధన జరుగుతోందని అన్నారు. మావుళ్లమ్మ సేవా సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TADEPALLIGUDEM
I.P.No.16/2025

Between:
Sypureddy Rambabu ...Petitioner
And
1. Jillelamudi Dairyalakshmi
2. Vankina Bala Naga Venkata Sri Rama Rao
3. The Official Receiver ...Respondents.

To, 1st Respondent:
Jillelamudi Dairyalakshmi, W/o Subash Chandra Bose, Door No.2-135, Durgamma gudi Veedhi, Prathipadu village, Pentapadu Mandalam, West Godavari District, TPG SCJ.

2nd Respondent:
Vankina Bala Naga Venkata Sri Rama Rao, S/o Akkayya Chowdary, Door No.1-53-14/3A, Road No.4, Tirumala Nest, F.C.I Colony, Tadepalligudem, West Godavari District, TPG SCJ.

3RD Respondent:
The Official Receiver, Eluru, West Godavari District, Eluru.

NOTICE
Please take notice that the Petitioner filed the above Creditor Insolvency petition against you for adjudicate the 1st respondent as insolvent and to Set-a-side documents Nos.18474/2024 executed by the 1st respondent in favour of the 2nd respondent and for administration of debts of the 1st respondent including the debt of the petitioner under the promissory note dated 27-03-2024 executed by the 1st respondent in favour of the petitioner for an amount of Rs.5,00,000/- i.e., petition B schedule property. The Honourable court ordered to made publication to you through the Praja Sakthi News paper, Tadepalligudem. So, you are all here by directed to appear before the Honourable court at 10-30 A.M on 04-07-2025 to which date the above creditor insolvency petition stands posted either in person or through an advocate and file your counters if any regarding the objections to the petition, If you are failed to appear before the Honourable court at 10-30 A.M on 04-07-2025 the petition will be decided in your absence.

(By order of the court)
K. MANI KUMAR,
Advocate for Petitioner
Tadepalligudem.
Tadepalligudem
Date: 05-06-2025

పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ టెండరు కం బహిరంగ వేలం ప్రకటన
మండల ప్రజా పరిషత్ పోలవరం కార్యాలయం ఏలూరు జిల్లా

ఆర్.ఓ.సి. నెం.8/19/2025 తేది.13-06-2025

ఏలూరు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్ ఏలూరు వారి ఉత్తర్వులు ఆర్.ఓ.సి.నెం. 8/19/2025 తేదీ 27.01.2025 జి.ఓ.ఎం.ఎస్. నెం. 253 తేదీ 08.08.2012 పంచాయితీరాజ్ అండ్ డెవలప్‌మెంట్ (ఎం.డి.ఎల్-1) ఆంధ్రప్రదేశ్ ప్రకారం పోలవరం పురుషోత్తపట్నం వద్ద ఫెర్రీ రేవు సుంకం వసూలు చేసుకొనుటకు 2025-26 సంవత్సరాలకు అనగా ది. 01.06.2025 నుండి 31.03.2026 వరకు హక్కులు కల్పించడానికి ది. 27.06.2025 న టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. పాటలో పాల్గొనుటకు ఆసక్తి కలిగినవారు ముందుగా పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం పనివేళల్లో వేలం ధరఖాస్తుని పొందవలెను. టెండరు షెడ్యూలు ధర 1000/- చలానా స్టేట్ బ్యాంకు నుండి ఉప ఖజానా కార్యాలయంలో ఎంపిడిఒ నిధుల పద్దు 84-18-109-001 నకు పోలవరం డిడిఒ కోడ్ 0413-2202 నకు పాటదారుని పేరుతో జమ చేయవలెను. జిఎస్టీ నిమిత్తం 180 రూ/లు ఎంపిడిఒ పోలవరం బ్యాంకు ఖాతా నెం. 11617922447 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0000778 నకు పాటదారుని పేరిట జమచేసి రశీదు పొందవలెను. 25.06.2025 తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో టెండరు షెడ్యూలు పొందవలెను. ధరావతు సొమ్ము 3 లక్షలు ఎస్‌బిఐ బ్రాంచి నుండి ఎంపిడిఒ ఆఫీసర్ పోలవరం పేరిట డిడి తీసుకోవాలి. 18 లక్షల తాజా సాల్వెన్సీ పేరిట తీసుకోవాలి. బోటు లైసెన్సు, ఇన్సూరెన్సు, అనుభవం సంబంధిత ధ్రువపత్రాలు విధిగా సమర్పించాలి. ప్రభుత్వం పాట 11,50,000 రూ/లు. ది. 27-06-2025 న మధ్యాహ్నం 2 గంటల నుండి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడుతుంది. మరిన్ని వివరాలకు ఎంపిడిఒ పోలవరం కార్యాలయంలో సంప్రదించండి.

మండల ప్రజాపరిషత్ అధికారి
మండల ప్రజా పరిషత్ పోలవరం
ఫోన్ నెం. 94937 42454